క్లుప్తంగా

ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలి


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఏసు క్రీస్తు జన్మదినం ప్రతి ఒక్కరికీ పర్వదినమని, ప్రజలందరికీ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు త్యాగాన్ని, ఆయన జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన మార్గంలో పయనించాలని కోరారు. సేవ, సహనం గుణాలను కలిగి ఉంటూ అందర్నీ ప్రేమించాలన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి


గోరిపర్తి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు: పార్టీ ఆదేశాలకనుగుణంగా సమన్వయం, ప్రణాళిక, సేవా భావంతో పనిచేస్తూ మంచి పేరు తీసుకురావాలని దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. దెందులూరు మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గోరిపర్తి శ్రీనివాస్‌ను శ్రీరామవరంలో నాని సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో యువత పాత్ర కీలకమని, పార్టీ విజయానికి నూరు శాతం ప్రణాళికలు రూపొందించుకుని కృషి చేయాలన్నారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఉత్సాహ భరితవాతావరణంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు శాఖా గ్రంథాలయాల్లో తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని చదివారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులకు నీతి కథలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమద్ వ్రతం

పెదపాడు: ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించారు. పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసారు. బల్లరేవు తూము సెంటర్లోని అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు

27న విద్యుత్ ఓసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ ఓసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ, 15వ వార్షికోత్సవం ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘ ఈపీడీసీఎల్ డిస్కమ్ ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ తెలిపారు. నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని కె కన్వెన్షన్ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. వీరితో పాటు జిల్లాలోని శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, కమ్యూనిటీ అధ్యక్షులను ఆహ్వానించామని తెలిపారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలోని పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ రాధ కార్మిక సంఘాల నాయకులకు స్పష్టం చేశారు. కార్మిక సంఘాల నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు పలు సమస్యలను కమిషనర్, డిప్యూటీ కమీషనర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల ఉద్యోగ, సిబ్బంది, కార్మికులకు 2022 జూన్ నెల వేతనం చెల్లించాలని కోరగా, మూడు విడతల్లో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎటువంటి రక్షణ లేని సర్వీసు రిజర్వాయర్ల వద్ద రక్షణ కల్పించేలా సిబ్బందిని నియమించాలని కోరగా, దానికి కమిషనర్ అంగీకారం తెలిపారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా వేతనాల్లో కట్ అవుతున్న పీఎఫ్, ఈఎస్ఐ ఆయా ఖాతాల్లోకి జమ చేయాలని, ప్రతి నెలా మొదటి తేదీన హెల్త్ అలవెన్స్, వేతనాలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని దినంతో పాటు వారాంతపు సెలవు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాళ్లకి కల్పించాలని కార్మిక నాయకులు కోరగా వాటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట కృష్ణ హామీ నిచ్చారు.

శోభాయమానంగా చర్చిలు


భీమడోలు ఆర్‌సీఎం చర్చి విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు


భీమడోలులో ఆకట్టుకుంటున్న సీఎస్ఐ చర్చి

భీమడోలు: మండలంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ పండుగను విశ్వాసులంతా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. దీనితో చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేసారు. చర్చిలు, ఇళ్లపై భారీ స్టార్స్ ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ దీపాలు అలంకరించారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లోని వివిధ సంస్థలకు చెందిన క్రైస్తవ చర్చిలు విద్యుత్ దీపాలతో, ఆలయాలను ప్రత్యేక అలంకరణతో సుందరంగా ముస్తాబు చేసారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు జరుపుకునే క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఆలయాల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ క్రిబ్స్ ఆకట్టుకున్నాయి. భీమడోలు విచారణ పరిధిలోని భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు పుట్టుక వృత్తాంతాన్ని తెలియజేలా అక్కడ సుందరంగా అలంకరించిన పశువుల పాకలో బాల ఏసును ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. విశ్వాసులంతా ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్నారు.


పెదపాడు మండలంలోని పునుకొల్లులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు

క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగు నింపాలి

పెదపాడు: మండలంలోని పలు చర్చిల్లో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విశ్వాసులు క్రైస్తవ గీతాలను ఆలపించారు. క్రీస్తు జనన వృత్తాంతం తెలిపే సాంఘిక నాటికలు చిన్నారులు ప్రదర్శించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చిలలో ఫాదర్లు క్రీస్తు సందేశాన్ని అందించారు. మానవాళికి క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఫాదర్లు శుభాకాంక్షలు తెలిపారు. పనుకొల్లు గ్రామంలో పాలిమెట్ల ఐజక్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలో విశ్వాసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

స్వచ్ఛమైన ప్రేమను పంచాలి

పెదవేగి : క్రీస్తు జన్మదిన వేడులను ప్రపంచమంతా ప్రజలందరూ సంతోషంగా జరుపుకుంటాని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ అన్నారు. క్రీస్తు ప్రేమ స్వచ్ఛమైనది, నిస్వార్థమైందని ఆయన అన్నారు. క్రీస్తు సందేశం ప్రకారం ప్రతి ఒక్కరూ ఎదుటి వారిని స్వచ్ఛంగా ప్రేమించాలని ఆయన అన్నారు. ఆకలిగా ఉన్నవారికి భోజనం పెట్టాలని, వస్త్రదానం చేయాలని, పేద వారిని ఆదరించాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి సమాధానాలతో జీవించాలన్నారు. ఇవన్నీ ఆచరణాత్మకంగా తన జీవిత విధానం ద్వారా ప్రభువు మానవులకు తెలియజేసారన్నారు. ఆ విధంగా అందరూ జీవిస్తే దేవుని రాజ్యం సాకారమవుతుందని ఫాదర్ మోజెస్ అన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి

- కలిసి సందడి చేసిన 1994–95 బ్యాచ్ విద్యార్థులు
- ముందూరు ఉన్నత పాఠశాల్లో కోలాహలం


ముందూరు ఉన్నత పాఠశాలలో కలిసిన 1994-95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

పెదవేగి : ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి సంగతులు, నాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ, క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ 28 ఏళ్ల తరువాత కలుసుకున్న బాల్య స్నేహితులంతా రోజంతా ఆనందంగా గడిపారు. పెదవేగి మండలం ముందూరు ఉన్నత పాఠశాల ఈ ఆహ్లాద సన్నివేశానికి వేదికైంది. పాఠశాల్లో పదవ తరగతి విద్యనభ్యసించిన 1994–95 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని సందడి చేశారు. రెండు నెలలుగా ఒక ప్రణాళిక ప్రకారం పనిచేస్తే ఈనాటికి బాల్య స్నేహితులు కలుసుకునేందుకు వీలు పడిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వారంతా సందడి చేశారు. ఈ కలయిక మమ్మల్ని తిరిగి 28 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిందని వారు తెలిపారు. రోజంతా నాటి గురువులతో కలిసి, చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుని పులకించిపోయారు. పాఠశాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తన చిన్ననాటి స్నేహితులను కలుసుకునేందుకు 50 మంది కుటుంబాలతో తరలివచ్చారు. ఆనాటి గురువులు ఇరుకులపాటి సాంబశివరావు, సుంకర బలరామయ్య, గద్దే అమరేశ్వరరావు, ఏడీవీ ప్రసాద్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేసి, ఆట, పాటలతో ఆహ్లాదంగా గడిపారు.

విజయవంతంగా ప్రజా ఆశీర్వాద పాదయాత్ర

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం


ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్ కుటుంబం అందరి సహాయ సహకారాలతో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర విజయవంతం కావడం తనకెంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి, దెందులూరు రెండు మండలాల్లో 9 రోజులు పాటు 157 కిలోమీటర్లు ప్రజా ఆశీర్వాద పాదయాత్ర విజయవంతంగా పూర్తయిందన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ, జిల్లా, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తనను ప్రోత్సహించి, సంఘీభావం ప్రకటించారని అన్నారు. తనతో పాటు నడిచిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా లబ్ధిదారులకు అందించామన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న నాయకత్వం, పరిపాలనపై సంతృప్తిగా ఉన్నారన్నారు. పాదయాత్ర ప్రారంభించిన నాటి నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటా ప్రజలు చూపిన ఆదరణ, ప్రేమ తాను ఎన్నటికీ మరువనన్నారు. దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజలకు, తన తల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన సాధికార బస్సు యాత్ర, అనంతరం ఎమ్మెల్యే ప్రజాఆశీర్వాద పాదయాత్ర నిర్వహించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. అన్ని గ్రామాల్లో ఐక్యంగా నాయకులు, కార్యకర్తలు పాదయాత్రను విజయవంతం చేశారు.

ఎమ్మెల్యే కొఠారు పాదయాత్రకు విశేష ప్రజాదరణ


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్

దెందులూరు : దెందులూరులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేస్తున్న ప్రజా ఆశీర్వాద పాదయాత్ర టీడీపీకి దెందులూరు నియోజకవర్గంలో ముగింపునకు నాంది పలుకుతోందని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు పెరుగుతున్న మద్దతు చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు ఆందోళన చెందడమే కాకుండా ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. పోలవరం గట్టు మాయం చేసింది ఎవరో ఈ నియోజకవర్గంతో పాటు రాష్ట్రమంతా తెలుసునన్నారు. దెందులూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మొదటి విడత ప్రజా ఆశీర్వాదయాత్ర విజయవంతం కావడంతో టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇటీవల సాధికార బస్సు యాత్ర విజయవంతమైందని, ఎమ్మెల్యే నాలుగు విడతల తలపెట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర రెండు మండలాల్లో 23 గ్రామాల్లో 158 కిలోమీటర్లు పూర్తయ్యిందని తెలిపారు. ఇంకా 2, 3, 4 విడతలుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. బాపిరాజుగూడెంలో ఇంటింటా ప్రజలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని ఆదరించిన తీరుపై టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పోలవరం మట్టి దోపిడీ, తమ్మిలేరు ఇసుక దోపిడీని ప్రజలు మర్చిపోలేదని అన్నారు. చింతమనేని ఆయన అనుచరులు ఎమ్మెల్యే కొఠారుపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ టికెట్ విషయంలో ఎంత అయోమం, ఆందోళన, గందరగోళం నెలకొందో ఆపార్టీ నాయకుల ప్రకటనలు చూస్తే అర్థమవుతుందన్నారు. ఎవరు పోటీలో ఉన్నా కొఠారు అబ్బయ్యచౌదరి చేతిలో ఓడిపోవడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని నాని సవాల్ విసిరారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమన్నారు. చింతమనేనిని నియోజకవర్గ ప్రజలు ఎప్పుడో పక్కన పెట్టారని, ఆ విషయం ఆపార్టీ నాయకులు గుర్తిస్తే మంచిదన్నారు. దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు మాట్లాడుతూ ఎవరు వచ్చినా అబ్బయ్యచౌదరి చేతిలో మరోసారి ఓడిపోవడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజల ప్రజాదరణ చూసి ఎన్నికలకు ముందే టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. దెందులూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఎగురవేయడం తథ్యమన్నారు. పెదవేగి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జానంపేట బాబు, ఇతర నాయకులు ఉన్నారు.

ముగిసిన షష్ఠి వేడుకలు


కైకరంలో షష్ఠి ఉత్సవాల్లో జన సందోహం


సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్

ఉంగుటూరు: మండలంలోని కైకరంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు ముగిశాయి. ఆదివారం ఆఖరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చుట్టపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో షష్ఠి తీర్థానికి హాజరయ్యారు. ఆలయం వద్ద పోలీసులు, కమిటీ సభ్యులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఏడురోజుల పాటు నిర్వహించిన షష్ఠి వేడుకలను విజయవంతం చేసినందుకు భక్తులకు, ప్రజలకు, అధికారులకు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలానికి పయనమైన శివ మాలధారులు

భీమడోలు: భీమడోలులో శివ మాలధారుల ఇరుముడుల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఇరుముడుల ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసారు. భీమడోలులోని శివ పీఠానికి చెందిన మాలధారులు తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు కాళ్లకూరి ఉమాశంకర్ శర్మ, శివశర్మ వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో మాలధారులు ఇరుముడులు ధరించి శ్రీశైలంలోని శివయ్య దర్శనానికి తరలి వెళ్లారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఆలయాలను దర్శించుకున్నారు. దీనితో శివ నామ స్మరణలతో గ్రామం హోరెత్తింది. మాలధారుల కుటుంబ సభ్యులు, భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

'ఆడుదాం ఆంధ్ర'కు సర్వం సిద్ధం


దెందులూరులో త్రీ కే రన్ ప్రారంభిస్తున్న డీపీఓ టీ శ్రీనివాస విశ్వనాథ్


ముండూరు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం


కబడ్డీకి సిద్ధమైన కొప్పాక ఉన్నత పాఠశాల ప్రాంగణం

పెదవేగి : 'ఆడదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు పెదవేగి మండల వ్యాప్తంగా 5,691 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్ మనోజ్ చెప్పారు. వీరిని 661 టీంలుగా నమోదు చేసుకొని, వారందరికీ డిసెంబర్ 26 నుంచి సుమారు 332 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సుమారు 11మంది డ్రిల్ మాస్టర్లు 280 మంది వలంటీర్లు రిఫరీలుగా పని చేస్తున్నారని ఆయన అన్నారు. వీటికి సంబంధించి పెదవేగి మండలంలో 30 పంచాయతీల పరిధిలో సుమారు 20 గ్రౌండ్‌లను ఇప్పటికే సిద్ధం చేశామని, ఐదు రకాల ఆటలు (క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్) పోటీలు నిర్వహించేందుకు ఈ క్రీడా మైదానాలను సిద్ధం చేశామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రకు నమోదు చేసుకున్న క్రీడాకారులు వివిధ క్రీడలకు సంబంధించి టీంలు సంబంధిత సచివాలయాల్లో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి గ్రామం నుంచి ఐదు క్రీడా అంశాల్లో పురుషుల నుంచి ఐదు టీములు స్త్రీల నుంచి ఐదు జట్లను ఎంపిక చేసి మండల స్థాయిలో క్రీడా పోటీలకు విజేతలను పంపిస్తామని, గ్రామ స్థాయిలో ఈనెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు ఈ క్రీడలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో జనవరి 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ క్రీడలను పెదవేగి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని శివాలయం వద్ద గల మైదానంలో పెదవేగి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ఆయా సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులందరూ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, గ్రామీణ ప్రాంతం నుంచి క్రీడా ఆణిముత్యాలు వెలికి తీయటానికి సహకరించాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ కోరారు.

నమోదైన జట్ల వివరాలు

క్రికెట్ పోటీలకు పురుషుల జట్లు 88, మహిళా జట్లు 22, కబడ్డీకి పురుషులు 51 జట్లు, మహిళా జట్లు 58, ఖోఖోకు పురుషుల జట్లు 23, మహిళా జట్లు 91, వాలీబాల్‌కు పురుషులు జట్లు 91, మహిళా జట్లు 26, బ్యాడ్మింటన్‌కు పురుషుల జట్లు 79, మహిళా జట్లు 132 నమోదయ్యాయని తెలిపారు. మొత్తం పురుషులు జట్లు 332, మహిళా జట్లు 329 మొత్తం 661 జట్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దెందులూరులో 3 కే రన్ సందడి

దెందులూరు: గ్రామ శివారు, పట్టణ ప్రాంతాల్లో యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరులో ఎంపీడీఓ భీమరాజు, తహసీల్దార్ నాంచారయ్య, మండల వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో దెందులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 3 కే రన్ ప్రారంభించారు. ప్రత్యేకాధికారి శ్రీనివాస్ జెండా ఊపి త్రీ కే రన్‌ను ప్రారంభించారు. ఉన్నత పాఠశాల, బస్టాండ్ సెంటర్, వాటర్ ట్యాంక్ సెంటర్, గ్రంథాలయం, ఇండియన్ బ్యాంక్ సెంటర్, పాత హాస్పిటల్ మీదుగా 9వ వార్డు సెంటర్‌కు అక్కడి నుంచి దెందులూరు ఉన్నత పాఠశాలకు 3 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీనివాస్, దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చాటుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్థాయి ఉద్యోగులు ఈ ప్రక్రియ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి యువత, పీఈటీలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు (టూటౌన్): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు సురేష్ కుమార్ అన్నారు. స్థానిక తూర్పువీధిలో ఫ్రెండ్స్ అసోసియేషన్, కామన్ మేన్ రైట్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యాన జాతీయ వినియోగదారుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి వస్తువు కొనుగోలు, సేవలకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలిగినప్పుడు జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చునని తెలిపారు. కామన్ మేన్ రైట్స్ ఫోరం ఫౌండర్ నిమ్మల జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.